క్లుప్తంగా

జియో ట్యాగింగ్ పూర్తి చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న శివరాజన్

గుడిపాల: ప్రతి గ్రామంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌ను పూర్తిచేయాలని ఎంపీడీఓ శివరాజన్ ఆదేశించారు. గురువారం వసంతాపురం సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేల పురోగతిపై సిబ్బందిని ఆరా తీశారు. మిస్సింగ్ సిటిజన్ అప్‌డేషన్, పీఏసీఎస్ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌లపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా సర్వేలలో ఎంతశాతం పురోగతి సాధించారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు.

పోలీస్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందచేస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆ శాఖ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందచేశారు. వినోద్ అనే కానిస్టేబుల్ నింద్ర స్టేషన్‌లో పనిచేస్తూ గత ఏడాది సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య కళావతికి గురువారం కార్పస్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ రాజశేఖర్ రాజు అందచేశారు.

ఇంటింటా కుష్ఠు నిర్ధారణ సర్వే



గుడిపాలలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: కుష్ఠు నిర్ధారణ సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. గురువారం తుమ్మిందపాళ్యం, వసంతాపురంలో ఎల్సీడీసీ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ సర్వే బృందాలను పంపించి కుష్ఠు అనుమానిత మచ్చలు, స్పర్శమచ్చలను గుర్తించామన్నారు. కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎల్సీడీసీ సర్వే ద్వారా సంబంధిత వ్యక్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 250 ఇళ్లను సర్వే చేసినట్లు చెప్పారు.


పశువ్యాధులపై అవగాహన ఉండాలి



మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి పినకాపాణి

ఐరాల: పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని మద్దిపట్టపల్లె పశువైద్యాధికారి పినకాపాణి సూచించారు. ఆయన గురువారం నాంపల్లె, భీమనేనివారిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు, మూగ జీవాల కాపర్లు ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీజనల్‌గా గేదెలు, ఆవులు, ఎద్దులు, జీవాల్లో వ్యాపించే వ్యాధుల నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు. అనంతరం జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువులకు చూడి నిర్ధారణ, ఆరోగ్య పరీక్షలు చేశారు. పశుపోషకులకు వ్యాధులపై అవగాహన కల్పించారు.

రెండు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



కమ్మతిమ్మాపల్లెలో పశువులకు పిడుదుల నివారణ మందు స్ప్రే చేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: పాడిరైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుడిపాల, బొమ్మసముద్రం పశువైద్యశాల డాక్టర్లు సాయిసుధ, రవితేజ కోరారు. గురువారం కమ్మతిమ్మాపల్లె, పానాటూరులో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈనెలాఖరు వరకు వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. రెండు గ్రామాల్లో మొత్తం 402 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు చేశారు. పిడుదుల నివారణకు స్ప్రే, డీవార్మింగ్ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. ఎదకు రాని పశువులకు ప్రత్యేకంగా చికిత్స చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అబ్దుల్లా, జ్యోత్స్న, కిషోర్, చంద్రశేఖర్, శివ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇప్పట్లో లేనట్టే!

"మేమొస్తే పేదలకు సంక్షేమ పథకాల వర్షం కురిపిస్తాం. అవ్వాతాతలకు రూ.4 వేల పింఛను, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు ఇస్తాం. అలాగే అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేస్తాం" అని కూటమి నేతలు ఎన్నికల్లో బాకా ఊదారు. అధికారంలోకి రాగానే పింఛను మొత్తం పెంచినట్టే పెంచి లబ్ధిదారులను తొలగించడం మొదలుపెట్టారు. కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఇప్పటి వరకు వెబ్‌సైట్ తెరుచుకోలేదు. దీంతో అర్హులు పింఛను దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



బంగారుపాళెంలో పింఛన్ల సర్వే చేస్తున్న అధికారులు

- ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు
- అధికారంలోకి వచ్చి ఏడునెలలైనా తెరుచుకోని వెబ్‌సైట్
- ఉన్న పింఛన్ల తొలగింపునకు కుట్ర
- గ్రామాల్లో ప్రారంభమైన సర్వే

బంగారుపాళెం : పూతలపట్టు నియోజకవర్గంలో బంగారుపాళెం, తవణంపల్లె, యాదమరి, ఐరాల, పూతలపట్టు మండలాల్లో సుమారు 1,900 మందికి పైగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని చెబుతుండడంతో నిరాశగా వెనక్కి వస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త పింఛన్ల ఊసే లేకుండా పోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసింది. వలంటీర్లు ఇంటికే వచ్చి దరఖాస్తు పూర్తిచేసి గ్రామ సచివాలయంలో అందజేయగానే పింఛన్లు వచ్చేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కూడా ఎదురు చూపులు తప్పడంలేదు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ..

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు తమ పరిధిలోని గ్రామ సచివాలయాలకు వెళ్లి వెబ్‌సైట్ తెరుచుకుందా లేదా అని ఆరా తీస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. కొత్త పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారనే విషయంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదని ఆయా సచివాలయ ఉద్యోగులు చెబుతుండడంతో ఇంకెన్నాళ్లు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాలో తెలియడం లేదని అర్హులైన వృద్ధులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల మంజూరు విధానం నిరంతర ప్రక్రియగా కొనసాగిన వైనాన్ని గుర్తుచేసుకున్నారు. ఇప్పటి పరిస్థితిని తలుచుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం సచివాలయాలకు వచ్చే వారికి సమాధానం చెప్పలేక సిబ్బంది సైతం సతమతమవుతుండడం గమనార్హం.



పింఛన్ల ఏరివేత సర్వేలు ప్రారంభం

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు ప్రస్తుతం వస్తున్న పింఛన్లలో కొన్నింటిని ఎలాగైనా తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. పింఛను లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారంటూ రెండు రోజుల క్రితం నుంచి సర్వే ప్రారంభించారు. వారం క్రితం సీఎం చంద్రబాబు నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ కొత్తపింఛన్ల మంజూరు అంశంపై ఎటువంటి చర్చ జరగలేదు. ఈ నేపథ్యంలో ఇప్పట్లో కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ లేనట్లేనని దరఖాస్తు చేసుకున్న వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇకనైనా కూటమి పెద్దలు స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

కార్తీక్ కుటుంబానికి ఆర్థిక సాయం



కార్తీక్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న విజయసింహారెడ్డి

బంగారుపాళెం : ఇటీవల మృతిచెందిన ఎగువరాగిమానుపెంట గ్రామానికి చెందిన వీరజవాన్ కార్తీక్ కుటుంబానికి గురువారం చిత్తూరు మాదిరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ నిర్వాహకుడు, రిటైర్డు తహసీల్దార్ విజయసింహారెడ్డి రూ.5 వేల సాయం అందించారు. కార్తీక్ తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు మందడిని పరామర్శించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్తీక్ ప్రజల మదిలో నిలిచిపోయాడన్నారు. కార్యక్రమంలో రిటైర్డు తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు వినియోగించే 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు 300, అలాగే కరెంటు స్తంభాలకు వాడే క్రాస్‌హారాలు 1500 చేరాయన్నారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్స్ డ్రా చేసుకోవాలన్నారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ముగ్గురు సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ఆస్పత్రి అధికారులు ముగ్గురు సిబ్బందిని తాత్కాలికంగా కేటాయించారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం చోటుచేసుకుంటోంది. దీనిపై సాక్షి దినపత్రికలో బుధవారం ఆలస్యంగా ధ్రువీకరణ పత్రం జారీ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆస్పత్రి అధికారులు అక్కడి సమస్యపై ఆరా తీశారు. తాత్కాలికంగా ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. ఈ స్థానంలో తాత్కాలికంగా కాకుండా రెగ్యులర్‌గా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను కేటాయించాలని ఆస్పత్రి వర్గాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాయి.



ధ్రువీకరణ పత్రాల మంజూరు విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు

చరిత్ర అధ్యాపకురాలికి పురస్కారం



అవార్డు స్వీకరిస్తున్న పీసీఆర్ చరిత్ర అధ్యాపకురాలు శివశ్వేత

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలు శివశ్వేత సావిత్రబాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గురువారం గుంటూరులో నిర్వహించిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అవార్డు స్వీకరించారు. 14 ఏళ్లుగా ఆమె జిల్లాలో చరిత్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. అధ్యాపకురాలిగా ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు ప్రదానం చేశారు. ఆమెను పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం, ప్రపంచ చరిత్ర సంఘం పాండిచ్చేరి, చరిత్ర జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు అభినందించారు.

పీహెచ్‌సీకి వైద్య పరికరాల వితరణ

ఐరాల: మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీలో అందజేస్తున్న వైద్యసేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాదుకు చెందిన అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ మాధవన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వరుణ్ పిలుపునిచ్చారు. వారు గురువారం హైదరాబాద్ ఎస్‌బీఐ సహకారంతో రూ.2 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను కాణిపాకం పీహెచ్‌సీకి వితరణ చేశారు. ఇందులో హైడ్రాలిక్ బెడ్ కాట్–2, వెయిటింగ్ చైర్స్–5, వాటర్ ప్యూరిఫయర్–1, మెటల్ ఏయిర్ కూలర్–2, సోలార్ లైట్‌లు–2, కుర్చీలు–20, స్టాండింగ్ బీపీ వైద్య పరికరాలు–4 ఉన్నాయి. వైద్యాధికారులు రాజేశ్వరి, స్వాతి సింధూర మాట్లాడుతూ దాతల సాయం వెలకట్టలేనిదని కొనియాడారు. వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చిత్తూరు రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు, చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు, హెచ్‌ఆర్ శిరీష, బ్రాంచ్ మేనేజర్ రాజేష్, ఎంపీహెచ్‌ఈవో శివయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వేదవతి పాల్గొన్నారు.



వైద్య పరికరాలు అందజేస్తున్న అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ మాధవన్

తహసీల్దార్ సంతకం ఫోర్జరీపై లోతు విచారణ

- ఐదుగురిని అదుపులోకి తీసున్నట్లు సమాచారం
- కాపాడే ప్రయత్నం చేస్తున్న కూటమి నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కళావతి సంతకం ఫోర్జరీపై గురువారం తాలూకా పోలీసులు విచారణ ప్రారంభించారు. గత నెల ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ కోసం కొందరు వ్యక్తులు తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. దీనిపై అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. సాక్షి దినపత్రికలో గతనెల ఆగని ఫోర్జరీ దందా అనే పేరిట వార్తా కథనం కూడా ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ కళావతి ఆ ఫోర్జరీ సంతకం ఉన్న పత్రం ఆధారంగా రెండు రోజుల క్రితం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ ప్రారంభించిన పోలీసులు ఫోర్జరీ విషయంలో ఐదుగురి హస్తం ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిలో ముగ్గురు వీఆర్‌ఏలు, ఒక యువతి, ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే మరో వ్యక్తి ఉన్నట్లు సమాచారం. ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది డైరెక్షన్‌లోనే ఈ ఫోర్జరీ దందా నడిచిందని, ఈ కేసులో మరింత మంది హస్తం ఉన్నట్లు తెలిసింది. వారిని కాపాడేందుకు అధికార కూటమి నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వారి ప్రయత్నాలు ఏమాత్రం ఫలిస్తాయో వేచి చూడాల్సిందే.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : సీపీఎం

- కూటమి ప్రభుత్వ పాలనలో పరిశ్రమల స్థాపన నిల్
- పారిశ్రామికవేత్తలపై పెరిగిన దౌర్జన్యాలు

చిత్తూరు కార్పొరేషన్: నెల్లూరు జిల్లాలో ఫిబ్రవరి 3–6 వరకు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు సుబ్బారావు కోరారు. గురువారం చిత్తూరులో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహాసభల్లో భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు.దావోస్‌లో జరిగిన సదస్సులో ఏపీ కంటే తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని, ఎక్కువ ఎంఓయూలు తెలంగాణకే వచ్చాయన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రావడం లేదని, దీనికి కూటమి ప్రభుత్వం తీరే కారణమని తప్పు పట్టారు. అధికారంలోకి వచ్చింది మొదలు కప్పం కట్టాలంటూ ఆ పార్టీ నాయకులు పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుండడం, వారిపై దౌర్జన్యం చేయడమే కారణమని ఉదహరించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీకి 150 ఎకరాలు ఇచ్చినా ఇంతవరకూ పునాది వేయలేదన్నారు. కాకినాడ సెజ్‌లో 10 వేల ఎకరాల్లో బొమ్మల పరిశ్రమ ఒక్కటి తప్ప పరిశ్రమలే లేవన్నారు. 18 వేల ఎకరాల్లో ఉన్న వాన్ పిక్ సెజ్‌లో, హిందుపూర్‌లో నాలెడ్జ్ హబ్‌లో ఒక్క పరిశ్రమ లేదన్నారు. కేటాయించిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి, రుణాలు పొంది, ఎగనామం పెడుతున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు సురేంద్రన్, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, నాయకులు బాలసుబ్రమణ్యం, దాము, మురళి, చిరంజీవిమ్మ, సంతోష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకులు సుబ్బారావు

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పట్రపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిపాల: వెంగమాంబపురంలో..

వెంగమాంబపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల:మండలంలోని వెంగమాంబపురంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతోపాటు బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత చికిత్స చేసి మందులు, మాత్రలను ఉచితంగా అందజేశారు. వైద్య సిబ్బంది దివ్య, స్వర్ణ, సుమతి, రీటా, కార్లినమ్మ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఏలూరు రేంజ్ ఐజీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలికి, స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఎస్‌ఐ ధరణీధర పాల్గొన్నారు.



స్వామి చిత్రపటం అందుకుంటున్న ఐజీ

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి

చిత్తూరు కలెక్టరేట్ : ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. ఉర్దూ భాష స్థితిగతులపై గురువారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం పార్లల్ సెక్షన్ మంజూరుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కేంద్రం లో ఉర్దూ మాధ్యమ పాఠశాల లేకపోవడంతో ఉర్దూ విద్యార్థులకు నష్టం కలుగుతోందని తన దృష్టికి వచ్చిందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల ఉర్దూ ఉపాధ్యాయులు పత్ర సమర్పణ, అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించారు. పీవీకేఎన్ కళాశాల ఉర్దూ విభాగాధిపతి డాక్టర్ అన్సర్ హుస్సేన్ రచించిన "ఉర్దూ కే ముంతకబ్ సఫర్ నామోంకా జాయజా" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ అనురాధ, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి, ఎస్వీయూ ఉర్దూ ప్రొఫెసర్లు డాక్టర్ నిసార్ అహ్మద్, డాక్టర్ అమీనుల్లా, డాక్టర్ వసీవుల్లా బఖ్తియారి, కుప్పం మండల విద్యాశాఖాధికారి ఎస్ మహబూబ్ బాషా, జిల్లా సర్ఖాజి హజరత్ కమాలుల్లా షా జహూరి, రూటా రాష్ట్ర నాయకులు పఠాన్ మహమ్మద్ ఖాన్, ఖలందర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తదితరులు

ఎమ్మెల్యే దృష్టికి ఉర్దూ టీచర్ల సమస్యలు

ఉర్దూ టీచర్ల సమస్యలను రూట అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. పీవీకేఎస్ కళాశాలలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి ఆ అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఉర్దూ పాఠశాలల్లో ఖాళీలను విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సయ్యద్ హిదాయతుల్లా, ఖలందర్ బాషా, ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఖాన్, జిల్లా అధ్యక్షులు మునీర్ అహ్మద్ ,డాక్టర్ రహంతుల్లా, అసోసియేట్ అధ్యక్షులు నఖీయుల్లా ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ పాల్గొన్నారు.

శ్రీరంగంపల్లెలో భూముల రీసర్వే

గుడిపాల: మండల కేంద్రంలో వీఆర్వోలు, సర్వేయర్లు చేస్తున్న భూముల రీసర్వే పనులను రీసర్వే డెప్యూటీ తహశీల్దార్ రూపాదేవి పరిశీలించారు. గురువారం మండల సర్వేయర్ గోపినాథ్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, సర్వే సహాయకులతో శ్రీరంగంపల్లె రెవెన్యూ గ్రామంలోని పలు బ్లాక్‌లలో సర్వే చేశారు. మొదట ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములలో సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉన్న రైతుల భూముల వివరాలు సేకరించి ఆ దిశగా సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి రైతు పొలాన్ని క్షుణ్ణంగా సర్వే చేసి వాటి హద్దులను గుర్తిస్తున్నట్టు ఆమె తెలియజేశారు.



రీసర్వే చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

భౌబోయ్..!

- మండలంలో వీధి శునకాల బెడద
- గుంపులు గుంపులుగా సంచారం
- పాదచారులు, మోటార్ సైక్లిస్టుల వెంటబడుతున్న వైనం
- బెంబేలెత్తుతున్న ప్రజలు

గుడిపాల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పాదచారులు, మోటార్ సైక్లిస్టుల వెంటబడుతున్నాయి. వీటి ధాటికి కొందరు గాయాలపాలవుతున్నారు. మరికొందరు వాటి బారిన పడి కుక్కకాట్లతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా చికెన్ దుకాణాల నిర్వాహకులు పారబోస్తున్న వ్యర్థాలను ఇవి బాగా అలవాటయ్యాయి. ఈ పరిస్థితుల్లో కనబడిన మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై దాడులు చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే మేకలు, గొర్రెలపాకల్లోకి కూడా ప్రవేశించి, వాటిపై దాడి చేసి చంపేస్తున్నాయని మూగజీవాల పెంపకందారులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో మండలంలో కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీన్ని బట్టి చూస్తుంటే కుక్కల స్వైరవిహారం ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి కుక్కల బెడద కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్క దగ్గరికి వస్తే ఏమాత్రం కదలకుండా నిలబడి ఉండడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ పరుగెత్తరాదు. కుక్కల కళ్లలోకి సూటిగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లి కుక్క కరిచే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో కొట్టడం చేయకూడదు.
- ఒకవేళ కుక్కదాడి చేస్తే ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా దగ్గరకి వస్తే నేలవైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి.
- ఒకవేళ కుక్క కరిస్తే గాయాన్ని బాగా సబ్బుతో కడుక్కోవాలి.



నరహరిపేటలో సంచరిస్తున్న కుక్కలు

అందుబాటులో వ్యాక్సిన్



కుక్కకాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఎవరైనా సరే ఏ సమయంలోనైనా కుక్క కాటుకు గురైన వారు వెంటనే గుడిపాల పీహెచ్‌సీకి వస్తే వ్యాక్సిన్ వేస్తాం. నెలకు గుడిపాల, బొమ్మసముద్రం పీహెచ్‌సీల్లో 30 వరకు కుక్కకాటు బాధితులు వస్తున్నారు.

–సంధ్య, వైద్యాధికారి, గుడిపాల పీహెచ్‌సీ